జొయ్...జొయ్...స్ స్...ఊ..య్.. రకరకాల వూళలు యీలలతో గాలి వేస్తోంది చెవులు చిల్లులు పడేలా. సరాసరి ఇంట్లోనే సుళ్ళు తిరుగుతున్నాయా శబ్దాలు. ఇంతలో పెరట్లో బావి గిలక గిరగిరమని తిరిగింది ఎవరో నీళ్ళు చేదుతున్నట్టు . వీధి వరండా కప్పులో రాళ్ళు కదిలిస్తున్న శబ్దాలూ. మాంఛి నిద్రలో వున్న మందార వులిక్కిపడింది గుండెలు దడదడ మంటుంటే. నాలుక తడి ఆరిపోయింది. పైకి లేచేం దుకు భయం. దుప్పటి నిండా కప్పేసుకుని వూపిరి బిగ పట్టి చెవులు రిక్కించింది భయంగా. కిటికీ ప్రక్కన ఎవరో మట్టి త్రవ్వుతున్న శబ్దం. తర్వాత గజ్జెలు కది లిస్తూ నడుస్తూవున్న సవ్వడి. కాసేపటి తర్వాత హోరు గాలిలో కలిసిపోయింది. మందారకి శరీరమంతా చెమట పట్టేసింది. ఏడ్వాలనిపిస్తోంది కాని, ఏడుపు రావట్లే దామెకు. గుక్కెడు నీళ్ళు త్రాగేందుకు లేద్దామంటే ముసుగు తీసేందుకు భయం. వాళ్ళూ వీళ్ళూ చెప్పిన 'ఆ ఇంటి దెయ్యం' కథలు గుర్తువచ్చి మరీ హడలి పోతోంది. క్రమంగా ఆ వేళ రాత్రి గడచి కరగిపోతుం డగా వీధి తలుపు తట్టిన సవ్వడికి ఒక్క వుదుటున లేచి వెళ్ళింది మందార.

బేతాళ గృహం

వరండాలో నిలుచున్న భర్తని చూసేసరికి ఆమెకి పోయిన ప్రాణం లేచివచ్చింది. హమ్మయ్య! అనుకున్న ఆమె తెల్లవారి తీరికగా ఇల్లు మార్చేద్దామంటూ నచ్చ చెప్పింది భర్తకు. ఒక్క రాత్రి తను లేకపోతే హైరానా పడ్డ భార్యను ప్రేమగా చూశాడు చిరునవ్వుతో మోహన్. "నేనేం చెప్పినా మీకు తమాషానే! కావా లంటే రాత్రికి చూడండి నిజంగానే దెయ్యం వస్తుంది!" అంది బుంగమూతితో బెదిరిస్తూ మందార. అసలే ఊరిబయలు. దానికితోడు గాలుల వర్షాకాలం. ఆ వేళ రాత్రి గాలికితోడు భోరున వర్షం కూడా మొద లయింది. మళ్ళీ వికృతమైన వూళలు గిలక శబ్దాలు ... చిత్రంగా గజ్జెల శబ్దం మాత్రం రాలే. మోహన్ పెరట్లో లైటు వేసి చూస్తే... వట్టి గిలక బరబరా తిరుగుతోంది గాలి తాకిడికి! కళ్ళు పెద్దవి చేసి చూస్తున్న మందారకి చూపించి చిరునవ్వుతో తలు పేశాడు. తర్వాత పాత గుడ్డలు తెమ్మని గోడలోని తూములన్నీ మూసేశాడు. మందార చెయ్యి పట్టుకుని వరండాలో కెళితే వాళ్ళని చూసి రెండెలుకలు తుర్రు మన్నాయి పెంకుల్లోకి. "మనల్ని చూసి అవి సిగ్గు పడుతున్నట్లుంది. మనమూ పోదాం" అంటూ మోహన్ బెడ్ రూంవైపు దారితీశాడు. మంత్రముగ్ధలా కూడా వెళ్ళిందామె.

ప్రొద్దుట పేపర్ చూస్తున్న మోహన్ వంటింట్లో కాఫీ కలుపుతున్న భార్యని పిలిచి చూపాడు— మెళ్ళో గజ్జెలు శబ్దం చేస్తూ గంతులేస్తూ కోడివెంట పరుగెడు తున్న పక్కింటివారి కుక్కపిల్లని. అర్థమయిందన్నట్టుగా నవ్వేసి కాఫీ కప్పు అందించింది మందార ఆప్యాయంగా.

కె.రఘుకుమారి

వుడిగా వెళ్ళిపోయాడు.

మూడవుతుండగా గూండా లోపలకి వచ్చాడు. అప్పటికి మూడొందల ఓట్లు పోలయ్యాయి. బైట ఆడవాళ్ళెవరూ లేరు. అతను బాలెట్ పేపర్ల కట్ట అందుకున్నాడు. ఇంకో యిద్దరు కుర్రాళ్ళు చెరొక ముద్రా తీసుకుని టకటక వేసేస్తున్నారు. ఇతను మడిచి పెట్టెలో వేస్తున్నాడు. డ్యూటీలో వున్న నలు గురూ నిశ్శబ్దంగా చూస్తూ కూచున్నారు. నిస్సహాయత వల్ల విమల కళ్ళంట నీళ్ళు కారుతున్నాయి. మిగిలిన ముగ్గురూ బిక్క ముఖాలేసుకుని చూస్తూ కూచున్నారు. రెండొందల ఓట్లు పెట్టెలో వేసి ఆగారు. మిగిలిన ఓట్ల వెనక విమల సంతకం లేదు.

"సంతకాలు పెట్టు" బాలెట్ పేపర్ల కట్ట ఎసి రేశాడు.

"నేను చెయ్యను" కళ్ళు తుడుచుకుని పళ్ళ బిగువున సమాధానం యిచ్చింది.

"ఇదిగో అమ్మా- నాతో గొడవ పెట్టుకుంటే నీకు లేనిపోని చిక్కులొస్తాయి. నేనెంత మంచోణ్ణో అంత చెడ్డోణ్ణి. మంచిగా చెప్పినట్టు విని శుభ్రంగా యింటి కెళ్ళు- లేకపోతే" గూండా నవ్వాడు.

"మీరేమైనా చెయ్యండి. నే మాత్రం సంతకాలు చెయ్యను. నన్ను చంపినా సరే."

"అట్టాగా—"

"విమలగారూ" పక్క బూత్‌లోంచి విమల కొలీగ్ బైటికొచ్చాడు.

"మీరిలా రండి. అయ్యా మీరు కాస్తాగండి."

విమల బైటికొచ్చింది.

"విమలగారూ. మీకేమన్నా మతిపోయిందా? వాళ్ళ నెదిరించి నిలబడగలరా" అతను మందలించాడు.

"ఏంటండి? నా కళ్ళ ముందు అన్యాయం జరుగు తుంటే చూస్తూ ఊరుకోనా? వాళ్ళు చెప్పినట్టు చెయ్యనా? నా వల్ల కాదు. నా ప్రాణం పోయినా సరే" విమల ఆవేశం పెరిగిపోతోంది.

"మీకు నిజంగా మతిపోయింది. మీ ప్రాణాలిస్తే ఏం జరుగుతుంది? వీళ్ళు దొంగ ఓట్లు వేసుకోరా? ఈ బూత్‌లో మీ ప్రాణాల వల్ల న్యాయం జరిగిందనుకోండి. మిగిలిన చోట్లన్ని మీకు ఎన్ని ప్రాణాలున్నాయి ఇవ్వ డానికి? డిపార్ట్‌మెంట్‌లో మీ మాటలు విని తెలివిగల వాళ్ళనుకున్నాను. ఈ ఎలక్షన్లంతా బూటకం అని తెలియదూ? ఇదంతా అవినీతని తెలియదూ? దీన్ని మీరు నాలుగు వందల ఓట్లు పోలు చేయించకుండా ఆపి బాగు చేస్తారా? అందుకు ప్రాణం ఇస్తారా? చిన్నపిల్లలా మాట్లాడుతున్నారు. వెళ్ళి ఆ సంతకాలేవో చేయండి. ఇంకా నాలుగైదు గంటల్లో ఈ పీడ వొదుల్తుంది. రేపట్నించీ యిది గుర్తే వుండదు. సిల్లీగా ప్రవర్తించకండి. వెళ్ళండి."

విమల లోపలికి నడిచింది. ఆమెకు అర్థమైంది. కానీ రాజీపడడం కష్టంగా వుంది.

పెన్ను తీసుకుని సంతకాలు చేసింది. ఓట్లు పెట్టె లోకి వెళ్ళాయి. ఎన్ని ఓట్లు పోలయ్యాయో ఎకౌంటు రాసి కూచుంది. మిగిలిన ముగ్గురూ పెట్టెకు సీలేసి గుడ్డ సంచీలో పెట్టి కుట్టి అన్నీ కట్టలు కట్టి బస్తా సిద్ధం చేశారు. లారీ వచ్చింది. విమల కాబిన్‌లో ఎక్కింది. డ్రైవరు "అమ్మా మీరిటు నా వెనగ్గా కూచోండి" అన్నాడు.

"ఎందుకూ?"

"ఎందుకేమిటమ్మా. ఒచ్చేప్పుడు తెలవలా- ఈ ఆఫీసరు వట్టి ఛండాలుడు. రాత్రి క్లీనరు కుర్రాడితో మీ గురించి అసహ్యంగా మాట్లాడాడు."

"నా గురించా? నా గురించి అతనికేం తెలుసు?" విమలకేం అర్థం కాలేదు.

"తెలిసేదేంటమ్మా- మిమ్మల్ని వర్ణించి వర్ణించి నోటి తీట తీర్చుకున్నాడు. మా క్లీనరుకి తందామని పించింది గానీ ఆఫీసరు - ఏం చేస్తాడోనని ఆగాడు."

విమల పళ్ళు పట పటలాడించింది.

"వాడు- ఆ దరిద్రుడు. రానీ వాడి సంగతి చెబు తాను" విమల అరుపులకు డ్రైవరు బెదిరాడు.

"మీరిట్టా అంటారంటే నే చెప్పేవాడినే కాదు. మీరరిస్తే మీరే గోలవుతారు. మిమ్మల్ని యిటు కూచో మంది ఎందుకు? వాడు మీకు తగలకుండా మిమ్మల్ని మునిసిపల్ ఆఫీసుకు చేర్చడానికే కదా- రేపట్నించీ వాడెవరో మీరెవరో- ఈ ఒక్క రోజుకీ గోలెందుకు?"

విమల తల పగిలిపోతోంది. లారీ ముందు బైక్ మీద తుపాకితో ఇన్‌స్పెక్టర్.

అతని దగ్గర తుపాకీ లాక్కుని ఈ ఆఫీసర్ని కాల్చిపారెయ్యగలిగితే బాగుండు. కాల్చి పారెయ్యడం తప్ప యింకొకటి చెయ్యకూడదు వెధవల్ని. ఈ ఎన్నికలూ, ఈ ప్రజా ప్రతినిధులూ, ఈ మగ వెధవలూ అన్నిటినీ అందరినీ కాల్చిపారెయ్యాల్సిందే. కానీ తానేం చెయ్యలేకపోయింది. ప్రేక్షకురాలయింది. తుపాకీ చూపించి జనాన్ని బెదిరించి ఓట్లూ అధికారం సంపాదించుకున్నారు ప్రజా ప్రతినిధులు. ఆడవాళ్ళను చూపుల్తోనే కాల్చి చంపగలిగే అధికారం పుట్టుకతోనే సంపాదించుకున్నారు మగవాళ్ళు

విమల బుర్ర అగ్నిపర్వతంలా వుంది.

ఏమిటి మార్గం? ఏది పరిష్కారం. ఈ అన్యా యాన్నీ, అవమానాన్నీ దేనితో ఎదుర్కోవడం?

వీళ్ళ అధికారానికి, అహంకారానికీ మూలం ఎక్కడ? ఆ మూలానికి వీళ్ళెలా దేని ఆధారంతో చేరుకున్నారు? జనం— తనలాంటి జనం ఎలా దేని ఆధారంతో ఆ అధికారం సంపాదించుకుంటారు?

విమల తల నిండా ప్రశ్నలు. ప్రశ్నలు.